క్లుప్తంగా

దోమల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్



ఊలపల్లిలో దోమలమందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

బిక్కవోలు: దోమల నిర్మూలనకు ఊలపల్లి గ్రామంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి గ్రామంలో డ్రైనేజీల్లో దోమల నిర్మూలన మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ శివ మాట్లాడుతూ వేసవిలో దోమ బెడదతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దాని నుంచి ప్రజలను కాపాడేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోని ఎంపీటీసీ బండారు శివ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరునికి లక్షపత్రి పూజ



స్వామివారికి లక్షపత్రి పూజ చేస్తున్న అర్చకులు

పెదపూడి: గ్రామంలో ప్రాచీనంగా ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో అర్చకుడు కొమ్మాల్లపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో పది మంది రుత్వికులు లక్షపత్రి పూజ బుధవారం నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

జోరుగా మొక్కజొన్న పనులు

మధురపూడి: మొక్కజొన్న పొత్తు విరుపు పనులు కోరుకొండ మండలంలో జోరుగా సాగుతున్నాయి. అకాల వర్షాలు కురుస్తాయన్న ఆందోళనతో ఈ పనులను నిర్వహిస్తున్నారు. కోరుకొండ మండలం మెట్ట ప్రాంత కావడం, ఆరుతడి పంటల సాగుకు అనువుగా ఉండటంతో రైతులు దీన్ని సాగుచేస్తున్నారు. ప్రస్తుతం ధర క్వింటాల్ రూ.2,050 పలుకుతోంది. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో సుమారు ఐదువేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగైంది.

ఆటో యూనియన్ ఆర్థిక సాయం



శ్రీనివాస్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

రాజానగరం: మండలంలోని పాలచర్లకు చెందిన ఆటో డ్రైవర్ కడియం శ్రీనివాస్ (40) హఠాన్మరణంతో ఇబ్బందుల్లో ఉన్న అతడి కుటుంబానికి దివాన్ చెరువు ఆటోయూనియన్ అండగా నిలిచింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అతడి భార్య, ఇద్దరు ఆడపిల్లలకు యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యులందరూ కలిసి రూ.65 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఒకటో తరగతి, నర్సరీ చదువుతున్న ఆ ఇద్దరు పిల్లల చదువులకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఘనంగా కనకదుర్గమ్మ తీర్థం

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ తల్లి అమ్మవారి తీర్థం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం చైత్ర మాసం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ చైర్మన్ జామి విశ్వేశ్వరరావు, తదితరలు పాల్గొన్నారు.

శ్యామలాంబ జాతర



ఊలపల్లిలో శ్యామలాంబ అమ్మవారు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామ దేవత శ్యామలాంబదేవి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గ్రామంలోకి ఏ దుష్ట శక్తులు ప్రవేశించకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఉగాది నుంచి అమ్మవారి మేలుకొలుపు చేశారు. గత 15 రోజులుగా అమ్మవారికి పూజలు చేసి, గరగ నృత్యాలతో ఊరేగించారు. గురువారం అమ్మవారు తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఎంపీటీసీ సభ్యులు బండారు శివ,వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంద్రాల విజయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సీతానగరంలో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మహిళల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో బుధవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తొలుత డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కోసం, వారిపేరు మీదే ఎన్నో పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సమయంలో రైతు, డ్వాక్రా రుణమాఫీతో సహా 650 వాగ్దానాలు చేసిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మోసగించారన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని 5,257 సంఘాల్లోని 55 వేల మందికి మూడేళ్లలో రూ.135 కోట్ల వైఎస్సార్ ఆసరా సాయం అందించామని, సీతానగరం మండలంలో 1,629 సంఘాలకు చెందిన 16,290 మంది సభ్యులకు రూ.13.94 కోట్లు అందిస్తున్నామన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందించారు. అలాగే సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మెగా వైద్యశిబిరం

జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. జీఎస్ఎల్ హాస్పటల్ సౌజన్యంతో 19 మంది వైద్యులు శిబిరంలో వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మృతుల కుటుంబాలకు అక్షయ సంజీవిని పథకంలో నిత్యావసరాలు, బియ్యం అందిస్తున్నామన్నారు. జీఎస్ఎల్ హాస్పటల్ సౌజన్యంతో క్యాన్సర్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. అనంతరం సీతానగరంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పరిశీలకులు వి.రాజశేఖర్, సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్ చిన్నిమిల్లి వెంకటరాయుడు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, ఏరియా కో ఆర్డినేటర్ వై.జనార్దనరావు, ఏపీఎం మహాలక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్ రాజు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీలు వెన్నెల అప్పలనాయుడు, మట్ట నాగలక్ష్మి, పార్టీ నాయకులు మట్ట వసంతరావు, చల్లమళ్ల సుజీరాజు, కవల కృష్ణమూర్తి, సత్యం రాంపండు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం నుంచి గ్రామాల్లో చేపట్టే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వారి పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు బాల, లంకలపల్లి త్రిమూర్తులు, బియ్యకొట్టు సత్తిబాబు, పడాల కల్యాణ్‌రెడ్డి, తేతలి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8వ తేదీన రన్ ఫర్ జీసస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాస్టర్లు

మధురపూడి: ఈనెల 8న నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పాస్టర్లు కోరారు. ఈ మేరకు ఆ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం కోరుకొండ మండలం జంబూపట్నం బెతస్తా వర్షిప్ సెంటర్‌లో ఆవిష్కరించారు. పాస్టర్లు కృపావిల్సన్, లాజరస్, రాయుడు, జూలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పశ్చిమగానుగూడెం లూథరన్ చర్చి, బేతేలు ప్రార్థనా మందిరం, షాలేము పెంతుకోస్తు ప్రార్థనా మందిరం, కోరుకొండ లూథరన్‌చర్చి, జంబూపట్నం ప్రేయర్‌ప్లేస్, బేతెస్తా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో జంబూపట్నంలోని బెతెస్తా వర్షిప్ నుంచి పశ్చిమగానుగూడెం సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చి వరకు జరుగుతుందన్నారు. ఆరాధన టీవీ సౌజన్యంతో జరిగే ఈ కార్యక్రమంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పాస్టర్లు కోరారు.

పార్వతీదేవికి నవవర్ణ అర్చన

బిక్కవోలు: స్థానిక గోలింగేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవికి నవవర్ణ అర్చన నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద చైత్ర మాసం పౌర్ణమి సందర్భం అమ్మవారి నవావర్ణఅర్చన, కుంకుమ పూజలు, హారతి ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భూపతిపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ బేతపూడి రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకవరం మండలం భూపతిపాలెంలోని బాలురు, తుని మండలం జగన్నాథగిరిలోని బాలికల గురుకుల పాఠశాలాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లై చేసుకున్న వారికి మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- గాదరాడలో గడపగడపకూ మన ప్రభుత్వం



గాదరాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలో బుధవారం రాత్రి నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజలను ఏవిధంగా పీడించేవారో గుర్తు చేస్తూ, అటువంటి వారిని ఎప్పటికీ దూరంగానే ఉంచాలన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేశారు. సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే సీఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని వివరిస్తూ మరోసారి ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రామానికి చెందిన చిర్ల శేషవేణి గత కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతుంది. ఆ విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆమెను పలుకరించి, జరుగుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. కొన్ని ప్రాంతాలలో సరైన డ్రైనేజ్ సిస్టమ్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని, త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల చినబాబు, మండారపు వీర్రాజు, హరిబోలు చినబాబు, పలెం నాగవిష్ణు, శ్రీను, శివ పాల్గొన్నారు.

జీవిత బీమా ఉద్యోగుల ధర్నా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందించేలా చట్టం చేయాలంటూ ఢిల్లీ రాంలీల మైదానంలో జరుగుతున్న కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీకి మద్దతుగా జీవిత బీమా ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయం ధర్నా నిర్వహించారు. మోరంపూడి జీవిత బీమా సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కోదండరామ్, జి.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మికుల కనీస వేతనంగా నెలకు రూ.26 వేలు అందించాలని, పెన్షన్ రూ.10 వేలు రూపాయలుగా పెంచాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ సౌకర్యాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జగన్‌ది జనరంజక పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తి గ్రామ సచివాలయం–4లో గడప గడపకూ మన ప్రభుత్వం



అనపర్తిలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తున్నారని, జనరంజక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి గ్రామ సచివాలయం –4 పరిధిలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ, ప్రాంత వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలపై ఆరాతీస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యేకు అడుగడుగునా మహిళలు మంగళహారతులు పట్టగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు నల్లమిల్లి అచ్యుతరామారెడ్డి, నేషనల్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ కర్రి చినవెంకటరెడ్డి, వార్డు సభ్యురాలు చింతా సుజాత, పార్టీ నాయకులు కర్రి వెంకటరెడ్డి, టింబర్‌డిపో అన్నవరం, నల్లమిల్లి తాతారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లిమోహన్‌రెడ్డి, సత్తి విశ్వనాథరెడ్డి, ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



సాంస్కృతిక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

రంగంపేట: విద్యార్థులు చదువుతోపాటు ఆట, పాటల్లోనూ రాణించాలని వెంకటాపురం ఎంపీపీ యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంగరాజు సూచించారు. పాఠశాలలో జరిగిన వార్షికోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలు, స్కిట్లు, సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. వీటిని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్థలదాత మాగాపు దొరయ్య, పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించిన జి.నెల్సన్ జైరాజ్, స్కూల్ వైస్ చైర్మన్ కన్నాబత్తుల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు విజయబాబు, విద్యాకమిటీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెల్లయ్య చెరువులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

రాజానగరం: వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 363లో 5.04 ఎకరాలలో ఉన్న చెల్లయ్య చెరువు ప్రాంతంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పోలీసుల రక్షణతో పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించారు. గతంలో మాజీ సైనికోద్యోగికి ఈ స్థలాన్ని పట్టాగా ఇచ్చారంటూ వారసులు ఇటీవల కాలంలో ఇక్కడకు వచ్చి, గుడారాలు వేసి, స్థలంపై హక్కును పొందే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పునాదులు వేసి, ఇంటి నిర్మాణాలు సాగిస్తుండటంతో సంబంధిత ఫిషర్ మెన్ సొసైటీ సభ్యులు చేసిన ఫిర్యాదుపై అధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. పొక్లెయిన్ సాయంతో అక్రమ నిర్మాణాలను కూలుస్తుండగా మాజీ సైనికోద్యోగి వారసులు వచ్చి, పంచాయతీ కార్యదర్శి మేకా ప్రసాద్, ఇతర ఉద్యోగులతో ఘర్షణకు దిగారు. మాజీ సైనికోద్యోగికి ప్రభుత్వం ఇచ్చిన స్థలమని, దీనిని ఎందుకు అడ్డుకుంటున్నారంటూ నిలదీశారు. అయితే ఒకప్పుడు ఆ విధంగా జరిగిన మాట వాస్తవమేగాని, అప్పట్లోనే ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేసిందంటూ తహసీల్దారు పవన్‌కుమార్ వివరణ ఇవ్వడంతో ఆక్రమణల తొలగింపు చర్యలు కొనసాగాయి.

తొలగించిన నిర్మాణాలను పునరుద్ధరించాలి

మాజీ సైనికోద్యోగికి గతంలో ప్రభుత్వం ఇచ్చిన సాగుభూమిలో అతడి వారసులు నిర్మాణాలు చేసుకుంటుంటే అన్యాయంగా వాటిని కూల్చివేశారని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు ఆరోపించారు. తొలగించిన నిర్మాణాలను తిరిగి పునరుద్ధరించాలని, లేకుండా బాధితుల పక్షాన ఆందోళనలకు దిగుతామంటూ హెచ్చరించారు. పీహెచ్‌సీకి ఎదురుగా ఉన్న చాకలి చెరువును ఆక్రమించుకుని పక్కా భవనాలు నిర్మించుకుంటే వాటిజోలికి వెళ్లని అధికారులు పేదలపై ప్రతాపం చూపడం సరికాదన్నారు.

బాపనమ్మ జాతర ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో బాపనమ్మ

అనపర్తి: స్థానిక పాతవూరులో కొలువై ఉన్న బాపనమ్మ అమ్మవారి జాతర బుధవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైంది. జాతర సందర్భంగా తమ చిన్నారులను రక్షించాలని కోరుకుంటూ తల్లిదండ్రులు ఆలయ ప్రాంగణంలో వారితో కాగడాలను వెలిగించారు. అదేవిధంగా తమ పసుపు కుంకుమలను చల్లంగా చూడాలని కోరుతూ మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, విచిత్రవేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు జరిగే అమ్మవారి తీర్థం సందర్భంగా అనపర్తి పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై పి.అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఎమ్మెల్యేలు రాజా, సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా మాజీ ఉపప్రధాని జయంతి



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కోరుకొండలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అనపర్తి: దళితులు, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన దీన జనోద్ధారకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. దేశ మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. స్థానిక జగ్జీవన్‌రామ్‌నగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. సలగల సోమరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచి వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు ఏడుకొండలు, కొండేటి భీమేష్, ఏఎంసీ డైరెక్టర్ కోనాల సత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు పిల్లి రత్నరాజు, నులుకుర్తి దేవుడు, డేవిడ్, రాజు, పడాల కళ్యాణ్‌రెడ్డి, కేదారి రంగారావు, అబ్రహం, కానూరి కృష్ణ, పడాల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో..

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సర్పంచి వాసంశెట్టి రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు తాడి అరవిందరెడ్డి, ఎంపీటీసీ బొబ్బిలి గంగాభవాని, ఉపసర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బలభద్రపురం, పందలపాక, బిక్కవోలు గ్రామంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పెద్దాడ గ్రామంలో..

పెదపూడి: పెద్దాడ గ్రామంలో సర్పంచి డొకుబుర్ర మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, పార్టీ దళిత ప్రతినిధులు మోర్త శ్రీను, సాంబత్తుల చంటి, డొకుబుర్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకల్లో సర్పంచులు పాల్గొని జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పించారు.

పెదరాయవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

రంగంపేట: భారతదేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పెదరాయవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ జగ్జీవన్‌రామ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిని స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు, ఎంపీటీసీ మాచిన మమతారాణి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేల్, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి రవిశంకర్, గ్రామ సర్పంచ్ బరగటి సుజాత తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక తానా సెంటర్ సమీపంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరాటయోధుడు జగ్జీవన్‌రామ్

మధురపూడి: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పోరాటయోధుడు అని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ రామచంద్రరావుపేటలో బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 60 కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజానగరం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, పసుపులేటి బుల్లియ్యానాయుడు, ఉల్లిగణ, మాదిగ సామాజిక వర్గం నాయకులు ఇందుగమెల్లి సత్యనారాయణ, తాతపూడి చక్రవర్తి, వల్లభశెట్టి నాని, మద్దాల చంటిబాబు పాల్గొన్నారు.

మధురపూడి: బుచ్చెంపేట సెంటర్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి డాక్టర్ నిడమర్తి సత్తిరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పలు గ్రామాల్లో జయంత్యుత్సవాలు నిర్వహించారు.

నన్నయ యూనివర్సిటీలో..

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఈసీ హాలులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన చొక్కా శ్రీనివాసరావు (46) పాముకాటుకు గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజు బుధవారం తెలిపారు. వ్యవసాయ కూలీ అయిన శ్రీనివాసరావు మంగళవారం లంకభూమిలో మొక్కజొన్న చేలో పనికి వెళ్లగా.. పొడపాము ఎడమ కాలుపై కాటు వేసింది. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకు వెళ్లగా, అదే రోజు రాత్రి 8.30 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు బాల మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చింతాలమ్మ సిరిమానోత్సవం

సీతానగరం: రఘుదేవపురం గ్రామదేవత చింతాలమ్మ సిరిమానోత్సవాన్ని కొలగారం, గ్రామ రైతుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సిరిమాను ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమ్మవారిని దర్శించుకున్నారు.

అయ్యప్ప జన్మనక్షత్ర పూజలు

కడియం: ఆధ్యాత్మిక వేత్త తాడాల వీరవెంకట్రావు గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి జన్మ నక్షత్రమైన ఉత్తర నక్షత్ర పూజలు వైభవంగా జరిగాయి. గురుస్వామి ఇంటి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఠంలో కేరళ దేవస్థానంలో జరిగే విధానంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు చేశారు. పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు హాజరయ్యారు.